పసిడి, చమురు పైపైకే..

వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఔన్స్ బంగారం 3,150 డాలర్లకు

బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు • గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా • ఎగదోయనున్న ఆందోళనకర పరిస్థితులు

న్యూఢిల్లీ, నవంబర్ 27: అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, ముడి చమురు ధరలు వచ్చే ఏడాది ఆఖరుకల్లా భారీగా పెరుగవచ్చని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే ఔన్స్ పసిడి విలువ 2025 డిసెంబర్ నాటికి ఏకంగా 3,150 డాలర్లను తాకవచ్చని చెప్తున్నది. ఇది ప్రస్తుతంతో పోల్చితే 19 శాతం ఎక్కువ కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో ఇప్పుడు ఔన్స్ 2,550 డాలర్ల వద్ద ఉన్నది. అలాగే బ్యారెల్ క్రూడాయిల్ రేటు 100 డాలర్లకు చేరవచ్చని అంటున్నది. ఇప్పుడిది 70 డాలర్ల సమీపంలో కదలాడుతున్నది.

ఇదీ సంగతి..

ప్రపంచవ్యాప్తంగా నెలకొనే ప్రతికూల పరిస్థితులు.. ఓవైపు మదుపరులను, మరోవైపు డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సురక్షిత మదుపు సాధనమైన బంగారంతోనే తమ పెట్టుబడులకు రక్షణ అని మెజారిటీ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నా, స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నా, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా, అధికారాలు మారి వ్యాపార-వాణిజ్య పరిస్థితులు దిగజారినా.. వెంటనే పెట్టుబడులను గోల్డ్ వైపునకు మళ్లిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఇలాంటి ఘటనలకు ఎక్కువగానే అస్కారముందని, పుత్తడి ధరలు ఆల్‌టైమ్ హైల్లోకి చేరడం ఖాయమన్న అభిప్రాయాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయిప్పుడు. ఇక పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు క్రూడాయిల్ ధరల్ని సహజంగానే ఎగదోస్తాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇబ్బందికర వాతావరణం తప్పక ముడి చమురును ఖరీదెక్కిస్తుందని అంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దీనిపై ఐరోపా దేశాల వైఖరి, డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా తీసుకునే నిర్ణయాలు, చైనాతో సుంకాల పోరు ఇలా అనేకాంశాలతో క్రూడ్ సెంచరీ కొడుతుందన్న అంచనాలు పుష్కలంగా వస్తున్నాయి.

అమెరికానే కేంద్ర బిందువు

అటు బంగారం కావచ్చు, ఇటు ముడి చమురు కావచ్చు.. ఈ రెండు కమోడిటీ మార్కెట్లను అమితంగా ప్రభావితం చేస్తున్నది అమెరికా ప్రభుత్వ నిర్ణయాలు, ఆ దేశ ఆర్థిక పరిస్థితులే. వచ్చే ఏడాది జనవరిలో అగ్రరాజ్యంలో అధికార మార్పిడి జరుగనున్నది. ట్రంప్ అధ్యక్షుడు కానున్నారు. దీంతో ట్రంప్ దుందుడుకు వైఖరి, ఇప్పటికే బలహీనంగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ.. గోల్డ్, క్రూడ్ రేట్లను అమాంతం పెంచేస్తాయన్న అంచనాల్ని గోల్డ్‌మన్ సాచ్స్ వేస్తున్నది. ద్రవ్యోల్బణం భయాలు, ఆర్థిక ఇబ్బందులు గోల్డ్ ఈటీఎఫ్‌లకు డిమాండ్‌ను పెంచుతాయని, ముఖ్యంగా అమెరికా రుణ భారం.. అమెరికాసహా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులను బంగారం కొనుగోళ్లకు ఉసిగొల్పవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఇక ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు.. బాండ్, స్టాక్ మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేస్తాయన్నది తెలిసిందే. దీంతో విదేశీ మదుపరుల పెట్టుబడుల తీరు కూడా ఇక్కడ ప్రధానం కానున్నది.

పెరిగిన బంగారం ధర

వరుసగా రెండు రోజులు భారీగా పతనమైన బంగారం ధరలు బుధవారం కోలుకున్నాయి. హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ రేటు రూ.270 పెరిగి రూ.77,510గా ఉన్నది. సోమ, మంగళవారాల్లో రూ.24,00 పడిపోయిన విషయం తెలిసిందే. 22 క్యారెట్ రూ.250 అందుకుని రూ.71,050 వద్ద నిలిచింది. ఇక ఢిల్లీలో 10 గ్రాములు 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.650 పుంజుకొని రూ.78,800 పలికింది. కాగా, వెండి ధరల విషయానికొస్తే.. ఈ ఒక్కరోజే కిలో రూ.5,200 ఎగబాకి రూ.95,800లకు చేరింది. అంతర్జాతీయంగా అనుకూల పరిస్థితులు, స్థానిక జ్యుయెల్లర్స్ నుంచి పెరిగిన డిమాండే కారణం.

ధరల పెరుగుదలకు కారణాలు

- విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం
- స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు
- పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు
- సెంట్రల్ బ్యాంకుల నుంచి బంగారానికి అధిక డిమాండ్
- అమెరికాలో ఆర్థిక అస్థిరతలు
- పరస్పర సుంకాలు-వాణిజ్య యుద్ధాలు
- ఆయా దేశాల జీడీపీ అంచనాలు

ఎలక్ట్రిక్ యాక్టివా వచ్చేసింది..

సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు • జనవరి 1 నుంచి బుకింగ్ స్టార్ట్

బెంగళూరు, నవంబర్ 27: ఎట్టకేలకు యాక్టివా ఈ-స్కూటర్ మార్కెట్లోకి అందుబాటులోకి రాబోతున్నది. దేశవ్యాప్తంగా ఈ-స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హోండా మోటర్‌సైకిల్ గతంలోనే యాక్టివాను ఈ-స్కూటర్ రూపంలో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి ఈ-స్కూటర్ కోసం బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ..ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బెంగళూరు వేదికగా రెండు రకాలుగా ఈ-స్కూటర్లను ప్రదర్శించింది. యాక్టివా ఈ, క్యూసీ1 పేర్లతో వీటిని విడుదల చేసింది. ధర వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఎండీ, సీఈవో తత్సుసము ఓటాని మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ విభాగంలో ఇదొక మైలురాయి వంటిదని, దేశీయ బెస్ట్ ఈవీ ఏకోసిస్టమ్‌ను తయారు చేయడానికి చాలా సమయం పట్టిందన్నారు.

ఈ-యాక్టివా ప్రత్యేకతలు

- 1.5 కిలోవాట్ కెపాసిటీ కలిగిన రెండు బ్యాటరీలు ఇవ్వనున్నది
- సింగిల్ చార్జింగ్‌తో 102 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావడానికి 4.30 గంటలు, 6.50 గంటల్లో పూర్తిస్థాయిలో చార్జింగ్ కానున్నది.
- గంటకు 50 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్‌లో ఎల్‌ఈడీ లైటింగ్, 7.0 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్, రోడ్‌సైన్ డ్యూయో యాప్‌తో కనెక్ట్ చేసుకోవచ్చును.

పౌల్ట్రీ ఒత్తిడిలో పరిశ్రమ

- కేంద్రప్రభుత్వం చేయూతనివ్వాలి
- పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ డిమాండ్

మాదాపూర్, నవంబర్ 27: దేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధికి కీలకంగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉన్నదని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 16వ ఎడిషన్‌ను ఐపీఈ ఎంఏతో కలిసి నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఈ ఎగ్జిబిషన్ బుధవారం మొదలైంది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయ్ సింగ్ మాట్లాడుతూ.. ఏటా దేశ జీడీపీకి రూ.1.35 లక్షల కోట్ల సహకారాన్ని పౌల్ట్రీ ఇండస్ట్రీ అందిస్తున్నదన్నారు. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పిస్తున్నదని, అలాంటి ఈ పరిశ్రమ.. ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్ల కుదేలవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, సోయా వంటి దాణా ఉత్పత్తులతోపాటు పౌల్ట్రీ ఇండస్ట్రీ పరికరాలపై జీఎస్టీ భారం పెరిగిపోయిందని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రుణ లభ్యతనూ పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారందాకా కొనసాగనున్న ఈ ఎక్స్‌పోకు 40 వేలకుపైగా సందర్శకులు వస్తారని అంచనా.

తెలంగాణతో దోస్తీకి బల్గేరియా ఆసక్తి

హైదరాబాద్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): తెలంగాణతో వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పేందుకు బల్గేరియా ఆసక్తితో ఉన్నదని భారత్‌లో ఆ దేశ రాయబారి డా.నికోలాయ్ యాంకోవ్ వెల్లడించారు. బుధవారం ఆయన సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించి ఒక కామన్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను మంత్రి అంగీకరించారు. నూతన ఆవిష్కరణలు, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌లో తమ రాష్ట్రంలో అద్భుతమైన ఎకోసిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని శ్రీధర్ బాబు ఆయనకు వివరించారు. త్వరలో ఇరు దేశాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపాలని శ్రీధర్ బాబు చేసిన ప్రతిపాదనకు యాంకోవ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ దేశపు గౌరవ కాన్సులేట్, సుచిర్ ఇండియా ఇన్‌ఫ్రా సీఈవో డా.కిరణ్ కుమార్ హాజరయ్యారు.

మళ్లీ 80 వేలపైకి సెన్సెక్స్

230 పాయింట్లు పెరిగిన సూచీ

ముంబై, నవంబర్ 27: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. గత కొన్నిరోజులుగా భారీగా నష్టపోయిన అదానీ గ్రూపు షేర్లు తిరిగి లాభాల్లోకి రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 230.02 పాయింట్లు అందుకొని తిరిగి 80 వేల పైకి 80,234.08కు చేరుకున్నది. మరో సూచీ నిఫ్టీ సైతం 80.40 పాయింట్లు అందుకొని 24,274.90 వద్ద నిలిచింది. 24,354 గరిష్ఠ స్థాయి నుంచి 24,145 కనిష్ఠ స్థాయిలో కదలాడిన నిఫ్టీ చివరకు 80 పాయింట్లకు పైగా లాభపడింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఊగిసలాటలో కదలాడిన సూచీలకు ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు జోష్ పెంచాయి. ఫలితంగా భారీ లాభాలవైపు కదంతొక్కాయి. కొన్ని బ్లూచిప్ సంస్థలు నష్టాల్లోకి జారుకోవడం వల్ల భారీ లాభాలు నిలుపుకోలేకపోయాయి.

కోలుకున్న అదానీ గ్రూపు షేర్లు

అమెరికా విదేశీ అవినీతి పద్ధతుల చట్టం ప్రకారం గౌతమ్ అదానీపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశాలు లేవని అదానీ గ్రూపు స్పష్టంచేయడంతో ఈ గ్రూపు షేర్లు భారీగా పుంజుకున్నాయి. బుధవారం అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్ షేర్లు అత్యధికంగా 20 శాతం వరకు లాభపడ్డాయి. వీటితోపాటు అదానీ ఎంటర్‌ప్రైజెస్ 11.56 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, ఎన్‌డీటీవీ 9.35 శాతం, అదానీ విల్మార్ 8.46 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 4.73 శాతం, అంబుజా సిమెంట్ 4.40 శాతం, ఏసీసీ 4.16 శాతం లాభపడ్డాయి. దీంతో అదానీ గ్రూపు సూచీల ర్యాలీతో మొత్తం మార్కెట్ విలువ రూ.1,24,693.19 కోట్లు పెరిగింది. వీటిలో అదానీ పవర్, అదానీ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

- ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, మారుతి షేర్లు లాభపడ్డాయి.
- టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూస్టీల్, హెచ్‌యూఎల్, బజాజ్‌ఫైనాన్స్, నెస్లె, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, టాటాస్టీల్, ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఐసీఐసీఐ షేర్లు నష్టపోయాయి.

టెల్కోల అప్పు 4 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశీయ టెలికం సంస్థలు రుణాలతో సతమతమవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి నాలుగు టెలికం సంస్థల అప్పు రూ.4,09,905 కోట్లుగా ఉన్నట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ.2.07 లక్షల కోట్లు రుణం ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్లు, జియోకు రూ.52,740 కోట్లు, బీఎస్ఎన్ఎల్ అప్పు రూ.28,092 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. 2021-22లో బీఎస్ఎన్ఎల్‌కు రూ.40,400 కోట్ల రుణం ఉంది.

మాలధారణ చేసిన ఆర్టీసీ డ్రైవర్‌కు

బ్రీత్ ఎనలైజర్‌తో టెస్టు..

సామాజిక మాధ్యమాల్లో వైరల్..

తొర్రూరు, నవంబర్ 27 : అయ్యప్ప మాలధారణ చేసిన ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో ఆల్కాహల్ టెస్టు చేయడంపై పలువురు మండిపడుతున్నారు. తొర్రూరు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి నాలుగు వారాలుగా అయ్యప్ప మాల ధారణలో ఉన్నాడు. అయితే విధులకు హాజరయ్యే సమయంలో ఆర్టీసీ కానిస్టేబుల్ అతడిని తాగావా? అంటూ కించపరిచేలా వ్యవహరిస్తూ రోజూ బ్రీత్ అనలైజర్ పెట్టి ఆల్కాహల్ టెస్ట్ నిర్వహించడంపై మాలధారణ స్వాములు మండిపడుతున్నారు. అయ్యప్ప మాలధారణ స్వాములు, హిందువులు దీన్ని తీవ్రంగా ఖండిస్తూ డిపో కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఇది వైరల్ అవుతుండడంతో డిపో మేనేజర్ పద్మావతిరెడ్డిని వివరణ కోరగా విధుల్లో భాగంగా ప్రతి డ్రైవర్‌కు తప్పకుండా పరీక్షలు చేస్తామని, అది విధుల్లో భాగమేనని తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జీనత్ కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గార్ల, నవంబర్ 27 : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జీనత్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్ ఫోన్‌లో అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

తొర్రూరు, నవంబర్ 27 : ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్ గౌడ్ అన్నారు. బుధవారం తొర్రూరులోని స్థానిక హైస్కూల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా సదానందంగౌడ్ హాజరై మాట్లాడారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీ యాకూబ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు గుంటుక యాకయ్య, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, డీ చంద్రమౌళి, జీ శ్రీనివాస్, రమేశ్, హరికృష్ణాచారి, ప్రభాకర్‌రావు, రాజు పాల్గొన్నారు.

'కేజీకేఎస్ సదస్సును జయప్రదం చేయాలి'

పెద్దవంగర, నవంబర్ 27 : సీరోలులో ఈ నెల 29న జరిగే కేజీకేఎస్ జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుణగంటి మోహన్ పిలుపు నిచ్చారు. సంఘం మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం అనపురం రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. నాయకులు తాండాల అయోధ్య, అన్నపురం మల్లయ్య, అంజయ్య, పెద్దసోమిని, రాజు, మద్దెల వెంకన్న, సారయ్య బండి లచ్చయ్య, సంపత్, ఎరకలి యాకన్న, ఢీకొండా కమలాకర్, రాయిపల్లి యాకయ్య, మందపురి ప్రవీణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల పరిశీలన

నెల్లికుదురు/దంతాలపల్లి, నవంబర్ 27 : నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగయ్య కోరారు. బుధవారం నెల్లికుదురుతోపాటు దంతాలపల్లి పీహెచ్‌సీలను సందర్శించారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే నెల్లికుదురు పీహెచ్‌సీని 30పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, పాపారావు, మోషా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వెలికట్ట కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో

తొర్రూరు/పెద్దవంగర/నర్సింహులపేట: రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల అన్నారు. బుధవారం తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లోకి తరలించి మద్దతు ధరతో పాటు సన్న రకాలకు రూ.500బోనస్‌ను పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో తొర్రూరు, పెద్దవంగర ఏపీలు భాస్కర్, స్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ గోపాల్ నాయక్, ఏఈవోలు రాజు, వినయ్ పాల్గొన్నారు. కాగా, నర్సింహులపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ సంపేట రాము ప్రారంభించారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన

కేసముద్రం/డోర్నకల్/గంగారం/మరిపెడ/నెల్లికుదురు, నవంబర్ 27 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజు తండా కేజీబీవీ పాఠశాలల్లో రాష్ట్ర కోశాధికారి మంజూల, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మున్ని, ఉపాధ్యాయులు సుధా, శ్యామల, జ్యోతి, శ్రీదేవి, లక్ష్మీకాంత, ఫరీదా, కృష్ణవేణి, స్వాతి,శ్రీలత, శ్రీదేవి, సౌజన్య, పాల్గొన్నారు. గంగారం పాఠశాలలో ఎస్‌వో సూజాత, ఉపాధ్యాయులు సంజీవరాణి, దేవి, వసంత, సంధ్యారాణి, కల్పన, సుకన్య, వర్ధంతి, రజిత, కోమల, రజిత, సౌజన్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు మరిపెడ కస్తూర్బాగాంధీ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్ష,కార్యదర్శులు లింగానాయక్, ప్రభాకర్, మండల బాధ్యులు జనార్దనాచారి, నెహ్రూ, గోవర్ధన్, ప్రసాదరావు, మాధవి, ఉప్పలమ్మ, జ్యోతి పాల్గొన్నారు. నెల్లికుదురు కేజీబీవీలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న, కేజీబీవీ ఎస్‌వో సుమలత, మండల అధ్యక్ష,కార్యదర్శులు రంజిత్ కుమార్, జనార్దన్, నాయకులు నరేందర్, భాస్కర్, యుగేంధర్ పాల్గొన్నారు. అలాగే, కేసముద్రం మండలంలోని తిమ్మంపేట కేజీబీవీలో ఉపాధ్యాయులు, సిబ్బంది నిరసన తెలిపారు.

సూదనపల్లిలో మెగా పశువైద్య శిబిరం

కురవి, నవంబర్ 27 : మండలంలోని సుధనపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన, పాల ఉత్పత్తిపై పోటీ నిర్వహించారు. జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ బీ కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డుద్వారా రుణం పొందడానికి పాడి పశువులు, జీవాలు కలిగిన రైతులు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ రఘు బాబు మాట్లాడుతూ కేవలం ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సేమెన్ అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో స్థానిక పశువైద్యాధికారి రాజేందర్, కురవి, డోర్నకల్ పీవీసీ డాక్టర్లు నాగేశ్వర్

ఆవుకు కృత్రిమ గర్భధారణ చికిత్స అందజేస్తున్న వైద్యులు

రావు, రామ్ చంద్, డాక్టర్ అశోక్ తదితరులు పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఉత్తమ పాడి రైతులను ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. శిబిరంలో వీఎల్‌వో సరోజ, జేవీవో రేవతి, వీఏ సంధ్య, ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ రఘువీర్, గోపాలమిత్రులు రవీందర్, హరికిషన్, అశోక్, లింగయ్య, సుధాకర్, కృష్ణ, యాకాంబ్రం, భాస్కర్, పశుమిత్ర శారద పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

కేసముద్రం/ఇనుగుర్తి, నవంబర్ 27 : హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కేసముద్రంలో ఆర్ఐ సౌజన్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు బదులుగా రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని చెప్పి నేటికి అమలు చేయడం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన గొల్ల కురుమలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కన్నెబోయిన రామకృష్ణ, తండ మహేశ్, బట్టు నాగన్న, లింగస్వామి, వెంకన్న, కొమురమ్మ పాల్గొన్నారు. అలాగే, ఇనుగుర్తిలో సంఘం మండల అధ్యక్షుడు చిన్నాల కట్టమల్లు ఆధ్వర్యంలో డీటీ ఆకుల రవికి వినతిపత్రం అందజేశారు. బొబ్బుల ముత్తయ్య, చిర్రబోయిన సతీశ్, నర్రా ఉమేశ్, సుధాకర్, నామాల మహేశ్, పరశురాములు, ఎలగలబోయిన శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి

డోర్నకల్, నవంబర్ 27 : విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులే కీలకమని, వారు సహకరించాలని డోర్నకల్ జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బండి నరసింహారావు అన్నారు. బుధవారం మండలంలోని కస్నా తండా, లింబ్యా తండా, లచ్చ తండా, కొత్త దుబ్బ తండా, హూన్య తండా, ఉయ్యాల వాడ, బోరింగ్ తండాల్లో పాఠశాలకు గైర్హాజరైన 10వ తరగతి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను చదివించాలన్నారు. విద్యార్థులు రోజు పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులు రెండు బృందాలుగా ఏర్పాడి విద్యార్థుల ఇళ్లలోకి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శ్రీనివాసరావు, శంకర్, అమీనాబీ, సామెబ్ అలీ, శంకరయ్య, సీతారాములు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

బయ్యారం, నవంబర్ 27 : ఆపదలో ఉన్న కుటుంబాలకు పలువురు దాతలు ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన బట్టు రమ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం ఇల్లందు మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేశ్ రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట బయ్యారం మిత్ర బృందం సభ్యుడు రాజేశ్ ఉన్నారు. అలాగే, ఇటీవల కొత్తపేటకు చెందిన ఉపాధ్యాయుడు ఉపేందర్ బైక్ ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి రూ.10 వేల